# సుందరీ సుధాకరం

కాలేజీ నించి నేరుగా ఇంటికి వచ్చేస్తాడు సుధాకరం. 'హమ్మయ్య వచ్చేశారా? ఎంత అలసిపోయారో' అన్నట్టు వీధి గుమ్మంలోనే నిలబడి స్వాగతం చెప్తుంది సుందరి. ఆ మొహం చూస్తూనే అలుపంతా మాయమై జీవితం ఎంత మధురమైనదీ అనుకుంటాడు సుధాకరం. మరి ఆ రోజు సాయంత్రం సుందరి నీడైనా వీధి గుమ్మంలో కనపడలేదు. వీధి తలుపులు తెరిచే ఉన్నాయి. "సుందరీ! సుందరీ!" అని సున్నితంగా మృదువుగా పిలిచాడు. జవాబు లేదు. కాస్త స్వరం పెంచి ఉత్కంఠతో సుందరీ అన్నాడు.

"ఇక్కడా నేనిక్కడా" అనిలోపల నుంచి జవాబు.

"ఎక్కడ?"

"ఇక్కడే ఇక్కడే!"

"అబ్బ వంటింట్లోంచా- ఇక్కడా ఇక్కడా అనకపోతే వంటిల్లో ఉన్నానని అంటే తెలిసేది కదా. తలుపులన్నీ బార్లా తెరిచి నువ్వీ లోపల వంటింట్లో చతికిలబడి జాడీలకూ సీసాలకూ చీటీలు అంటిస్తున్నావా? వీధిలో నువ్వు కనపడక పోతే, పిలిచినా పలక్కపోతే కాస్త కంగారు పడ్డాను".

"సుందరమ్మా! నే వెళ్తున్నాను. తలుపువేసుకో" అని ఇప్పుడే ఆవిడ ఇలా వెళ్ళిందో లేదో మీరూ వచ్చారు మరి. తలుపు వేసుకునే వ్యవధి లేందే" అని- బుంగమూతి పెట్టింది సుందరి.

సుందరి మాటలు స్పష్టంగా శ్రావ్యంగా సంగీతంలా వినిపిస్తాయి కానీ, ఒకంతట అర్థమైచావని అంశాలు కొన్ని ఎప్పుడూ ఉండనే ఉంటాయి. అందుకే సుధాకరం తికమతపడిపోతూ ఉంటాడు.

"ఏమిటలా నిలబడిపోయారూ?" అని కుదిపింది.

"ఆ, ఏమీ లేదు. ఆవిడన్నావు. ఎవరావిడ?'

"అదే- ఆవిడేనండీ- మన ఇంటికి చనువుగా అభిమానంగా ఎవరొస్తారు- అదే ఎదురింటి బామ్మగారు"

"హమ్మయ్యా!- ఎదురింటి బామ్మగారా- ఎంతసేపటికి చెప్పావు!" ఇలాటి చిన్న ప్రశ్నలే ఇబ్బంది పెట్టి పడేస్తూ వుంటాయి. అలాటి ప్రశ్నలకు వెంటనే జవాబు తట్టక- విసుగుదల వచ్చేస్తుంది పాపం.

"ఆవిడ ఆవిడ అంటే సందర్భం బట్టి అర్థం చేసుకుపోవాలి కానీవచ్చింది మొదలు గుక్క తిప్పుకోనివ్వరుకదా. మీ తొందర చూస్తే నాకు ఉన్న మతీ పోతుంది. నాలిక చివర్న ఉన్నమాటకూడా ఊడిపడదాయె".

"నీదంతా విడ్డూరంసుమీ. నామవాచకం అన్నది మొదటి వాక్యంలో ఉపయోగించకుండానే సర్వనామంతో ప్రారంభించి నన్ను తికమక పెట్టడం నీకొక వేడుక కాబోలు" అని బిక్కమొహం వేశాడు సుధాకరం.

"మా చెల్లెలు చెబుతూనే వచ్చింది. తెలుగు ఉపన్యాసకుణ్ణి చేసుకుంటున్నావే.. అక్కా! బావ చీటికీ మాటికీ క్లాసు తీసుకుంటాడేమోనే- అని.. అన్నంతపనీ చేస్తున్నారు కదా. ప్రతీ వాక్యానికీ కర్తా- కర్మా- క్రియా- నామవాచకము- సర్వనామమూ అని తూచి తూచి మాట్లాడుతుంటే ఇంక మాటల్లో థ్రిల్ ఏమిటి మాష్టారూ!"

ఈ రివర్స్‌క్లాస్‌కి అదిరిపోయాడు సుధాకరం. ఎదురింటి బామ్మగారు వచ్చి వెళ్ళడం- సుందరి ఎన్నడూ లేందీ వంటింట్లో సీసాలూ జాడీలూ డబ్బాలూ ముందేసుకుని సర్దుతూ చీటీలు అంటిస్తూ ఉండడం చూడగానే ఏదో పథకం వేస్తున్నట్టు ఊహించగలిగాడు.

"అదే- బామ్మగారేమో మరీ- రేపే ప్రయాణానికి మంచి రోజని అన్నారు. అది తప్ప ఇంత వేగం అంత మంచి ముహూర్తం లేదట" అని చదరంగంలో ఒక బంటుని నడిపినట్టు చొరవ తీసుకుని సుందరి అడుగు ముందుకు వేసింది.

"అయ్యబాబో- ప్రయాణం రేపేనా? ఏదో మాటవరసకి సరేనన్నాననుకో..." అంటూ సుధాకరం నీళ్లు నమిలాడు.

"మా అనకాపల్లి పిన్ని కొడుకు శుభలేఖతోపాటూ ఉత్తరం కూడా పంపించాడని చెప్తే సరే అన్నారు. మీకు మాట వరసకో మాటా... మనసులో ఇంకో మాటా ఉంటుందని నాకేం తెలుసు చెప్పండి!"

ఇక తర్కానికి నిలబడ్డం కష్టమే అనిపించింది పాపం. సుధాకరం తన బాధని కాస్తా- సుందరి ఎదుట దించుకోక తప్పలేదు. "ఒక్కడినీ- అందులో వంటరాని వాడినీ- ఎలా బ్రతకగలనన్నదే నా బాధ" అని వగచాడు.

"ఇద్దరం వెళదామంటే కాలేజీలో ఇన్‌స్పెక్షను జరుగుతోంది. శలవు దొరకదన్నారు. నాకుమాత్రం మిమ్మల్ని వంటరిగా వదిలి పోవాలని ఉంటుందా ఏంటి? తప్పదు కాబట్టి ఒక నాలుగు రోజుల్లో ఇలా వెళ్ళి అలా వచ్చేస్తాను. మీకు వంటరాదనేకదా నా బాధ. ఇదిగో

చూడండి" అని తన ప్రతాపం చూపించింది. వంటింటిని ఒక డిస్పెన్సరీలాగ సిద్ధం చేస్తున్నట్లుంది చూడబోతే. డబ్బాల మీద కందిగుండ, నువ్వుల గుండ, ధనియాల చారు గుండ, అన్న చీటీలు అతికించి ఉన్నాయి. జాడీల మీద మాగాయ, పాత ఆవకాయ, ఉసిరిగ పచ్చడి.. అని చీటీలు కొట్టవచ్చినట్టు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

"ఏమిటి సుందరీ ఈ గుండలు" అన్నాడు సుధాకరం.

"గుండలంటే హడలి పోతారేంటీ" అని దీర్ఘం తీస్తూ "మేం తూర్పు వాళ్లం. గుండలంటే మీరంతా ఆ పొడీ ఈ పొడీ అంటారు. అంతే తేడా. ఏణ్ణర్ధం కాపురం చేశాక మీరు పొడిని గుండ అనీ వక్కలని చెక్కలనీ అనక పోతారా, నేను వేళాకోళం చెయ్యకుండా ఉంటానా ఏంటి? అంతేకాదు మగాళ్ళంతా వంట నేర్చుకునే రోజులు వస్తున్నాయి" అని కళ్ళు చక్రాల్లా చిత్రంగా తిప్పింది సుందరి.

"ఎదురింటి బామ్మగారికి నేనంటే ప్రాణం. మరేమో, ఆవిడ అన్నది కదా- దగ్గిర వాళ్ళమైనప్పుడు పెళ్ళికి వెళ్ళక పోతే ఏం బావుంటుందీ- రేపే మంచిది- వెళ్ళమ్మడూ- నేను అబ్బాయికి కాస్త పులుసో, పచ్చడో చేసి పంపకుండా ఉంటానా. అతన్ని కాస్త అత్తెసరుగా అన్నం వండుకోమను అని సలహా ఇచ్చారు" ఈ మాటలతో ఇక సుధాకరానికి ఒప్పుకోక తప్పలేదు.

సుందరి ప్రయాణమూ ఆగలేదు.

"బామ్మగారికేం బరోసా ఇస్తుంది. నేను వంటరిగా ఉండొద్దూ. ఆవిడకేం తెలుసు నా బాధ.కేవలం భోజనం ఒక్కటేనా నాకున్న సమస్య?" అని మనసులో బామ్మగారి మీద బోలెడంత అక్కసు పెంచుకున్నాడు. ఏం చేస్తాడు సుధాకరం.

"ఇంతకీ- మీ అనకాపల్లి పిన్ని కొడుకంటే నాకు సరిగ్గా గుర్తు లేదు సుందరీ! మన పెళ్ళికి తీయించుకున్న గ్రూప్ ఫొటోలో ఆ రెండు జడల అమ్మాయి పక్కన కౌబాయ్ డ్రస్సులో నిలబడ్డాడే ఆ అబ్బాయేనా?" అంటూ ఒక వెర్రి ప్రశ్న వెయ్యకుండా ఉంటే ఎంతో బావుండేది. సుందరి ఆ ప్రశ్నను జాగ్రత్తగానే విశ్లేషించినట్టు ఒక్క క్షణం ఆగి-

"పెళ్ళికి వచ్చిన అంత మంది బలగంలోనూ మీకా రెండు జడల నంగనాచే బాగా గుర్తున్నట్టుందే. వట్టి సెకాళీగుంట. వాళ్ళ అమ్మా నాన్నా దానికి పెట్టిన పేరు రత్నం."

"రత్నం అన్న పేరుకేం బాగుంది. నీకెందుకో ఆ పేరు నచ్చినట్టు లేదు. పోనీలే. ఆ రత్నం ఈ అనకాపల్లి పిన్ని కొడుకు పెళ్ళికి వస్తుంది కదూ! మీ బంధుత్వాలింకా నాకు వంటపట్టలేదు సుందరీ! మన పెళ్ళి హడావిడిలో ఎవరు ఎవరో ఎలా గుర్తుంటుంది?"

"అదెందుకొస్తుందీ పెళ్ళికి. ఛస్తే రాదు మా అనకాపల్లి పిన్ని కొడుక్కీ దానికీ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. అసలు దానికెవరితో పడుతుంది...."

"ఎందుకనీ? అందకత్తెనని గర్వం కాబోలు..."

"ఆ గర్వంతోటే ఒంటరిగా బతుకుతోంది"

"పెళ్ళి చేసుకోలేదూ? అదేం?"

"అది అంతే- అదేం నాకు దగ్గర బంధువు కాదు. ఎత్తిస్తే ఏడు చెక్కలు. వేలు విడిచిన పెదనాన్న కూతురు. అక్క వరుస. కానీ నీ కంటే చిన్నదాన్నే- అక్కా అంటుంది నన్ను- మెడిసిన్ చదువుతానని ఏణ్ణర్థం వెలగబెట్టి చదవలేక మానేసింది. సినీ హీరోలాటి మొగుడుకావాలని వచ్చిన సంబంధాలన్నీ తిప్పికొట్టింది."

"సరే, ఇక పెళ్లి కాలేదన్నమాటే."

"ఎందుక్కాలేదూ! పెళ్ళయింది కానీ రెండు నెలలు తిరక్కుండా మొగుడితో పోట్లాడి వచ్చేసింది."

"ఎందుకనీ?"

"ఏముంది తిక్కగుంట. దీనికి నచ్చినట్టు అతడు క్రాఫ్ మార్చుకోనన్నాడట"

"అయ్యో అయ్యో అంత మాత్రానికే మరి ఏం చేస్తున్నట్టు".

"వాళ్ళ నాన్నకు తెలిసిన కంపెనీలో మెడికల్ రిప్రజంటేటివ్‌గా ఊళ్లన్నీ తిరుగుతుంది."

"ఊళ్ళు తిరిగే ఉద్యోగమా-?"

"సరి-సరి. దానికలాటి ఉద్యోగమే ఎంతో ఇష్టమట. ఆడవాళ్ళు ఎవరెస్టు శిఖరం ఎక్కడం లేదా. ఇంగ్లీషు ఛానల్ ఈదడం లేదా? అని ఎదురు ప్రశ్న వేస్తుంది- ఇక దాని ప్రసక్తి ఎందుకు. నా ప్రయాణం సంగతేమిటో చూడండి."

"నీ ప్రయాణానికేం? నువ్వు నిశ్చయించుకున్నాక ఇక ఆగుతుందా నీ రైలు. ఆ పేపరు వాడికీ- పాల మనిషికీ- ఈ నెలకి ఇవ్వవలసింది ఇచ్చేశావుగా?"

"ఇచ్చేశాను. మీకే బాధ్యతలూ మిగల్చలేదు."

"ఉత్తరం వ్రాయడం మరచిపోకేం"

ఈ మాటలకి సుందరి పగలబడి నవ్వింది. బుగ్గమీద అందంగా పడ్డ సొట్టని చూసి మురిసిపోయాడు సుధాకరం.

"వెళ్ళగానే ఉత్తరం వ్రాయడం మరచిపోకేం?" అన్నాడు. మళ్ళీ. పగలబడి నవ్వింది సుందరి.

"నాలుగు రోజుల భాగ్యానికి ఎంత హడావిడి చేస్తున్నారు. ఇలా వెళ్ళి అలా రానూ! ఉత్తరం కూడానా? వేసినా అది నా తరువాతే చేరుతుంది."

అలా సుందరి హంసలా ఎగిరి పోయాక ఇల్లు ఎడారిలా తోచింది. పాలు పొయ్యి మీద

పెట్టి పుస్తకం చదువుకుంటూ, ఆ పాలు కాస్తా పొంగి పొర్లి స్టౌ ఆరిపోయాక నుదుటి మీద వేళ్ళతో కొట్టుకుంటూ- బియ్యం అత్తిసరు పొంగించుకుంటూ అప్పుడప్పుడూ ఒంటరితనాన్ని మరచిపోడానికి ఏదో ఈల పాట పాడుకుంటూ గడుపుతున్న సుధాకరానికి రెండు రోజులకే జీవితం అర్ధరహితంగా గడిచింది.

తలుపు తట్టిన చప్పుడు విని ఒక ఆదివారం ఉదయం "ఎవరూ?" అని ఆశ్చర్యపోయాడు.

"నేనేనండీ. మీ ఎదురింటి సన్యాసిరాజుని. మా బామ్మ బచ్చలాకు పులుసూ, గోంగూర పచ్చడీ ఇచ్చి రమ్మంటే వచ్చాను" అన్నాడు ఎదురింటి యువకుడు. రుచీ పచీ లేని తిండితో నాలుక తుప్పుపట్టిన సుధాకరం మనసు పరవళ్ళు తొక్కింది, గోంగూర పచ్చడి మాట వినగానే. "మీ బామ్మగారు అనవసరంగా శ్రమ పడుతున్నారు- మిమ్మల్ని కూడా శ్రమ పెట్టేస్తున్నారు" అన్నాడు మాట వరుసకి.

"మా బామ్మ ఉట్టి వెర్రి బాగుల్ది. ఇష్టమైతే ఇక ప్రాణం పెడుతుంది."

"అలాంటి మంచి మనుషులు పెద్ద దిక్కుగా ఉండడం ఎంత అదృష్టం!"

"ఏం చెప్పారు. వెర్రి అభిమానమే కానీ ఒక్కొక్కప్పుడు అభిమానంతో నన్ను ఏడిపించేస్తుంది"

"అదెలా?"

"దీపాలు పెట్టగానే ఇంటికొచ్చి వేడి వేడిగా మా బామ్మ వండి వడ్డించిన తిండి తింటే పొంగిపోయి నాబాబే నా బంగారు కొండే అంటుంది. అయినా ఉద్యోగం అన్నాక రోజూ పెందరాళే ఎలా వస్తాం చెప్పండి కాస్త ఎప్పుడైనా అలా క్లబ్బుకెళ్ళి రమ్మీ ఆడుకుని ఆలస్యంగా వచ్చానా- ఇక తిట్లూ శాపనార్థాలు పెట్టేస్తుంది. ఉండు,నీకు పెళ్లిచేసిపారేస్తేగానీ తిక్క కుదరదు అంటుంది."

"ఎంతైనా బామ్మలకు ఆ మాత్రం అనే హక్కూ,అభిమానం ఉంటుంది."

"అందులో ముఖ్యంగా మీరూ అక్కయ్యగారూ మా ఇంటికెదురుగా వచ్చాక నాకు పెళ్ళి నోటీసు తరుచూ జారీ చేస్తోంది. మీ జంటని చూస్తే చూడ ముచ్చటగా ఉంటుందట. రోజూ మీ ఇద్దర్నీ మెచ్చుకోడంతోటే సరిపోతుంది మా బామ్మకి"

"ఆ తరం వాళ్ళకి ప్రేమలూ అభిమానాలూ ఎక్కువ"

"అక్కయ్యగారు ఎప్పుడొస్తారో ఏమో. మీరు సరిగ్గా తినక చిక్కిపోయినట్టు కనిపిస్తున్నారు. పోనీ వెళ్ళాక ఉత్తరం వ్రాశారా?"

ఈ ప్రశ్న సుధాకరాన్ని బాగా కలచివేసింది. నిజానికి ఉత్తరం రాకపోలేదు. ఒకే ఒక పోడి కార్డు ముక్క. "మా అత్తా మామయ్యా భిలాయ్ నుండి వచ్చారు. మేము రేపు అరకులోయ వెళ్తున్నాం. నిన్న సింహాచలం వెళ్ళాం" ఇదీ వరస. అందులో ఫలానా రోజున వస్తున్నాను,

అనుకోకుండా తిరుగు ప్రయాణం ఆలశ్యమైందని కానీ, మీరు ఏమి ఇబ్బంది పడుతున్నారో అని కానీ ఆదుర్ద ఏ అక్షరంలోనూ కనపడలేదు. ఆ ఉత్తరం వచ్చి అప్పుడే మూడు వారాలైనా మళ్ళీ ఉత్తరమన్నది రాలేదు. ఇలా సుధాకరం తన మనసులో జరిగిన విషయాలు నెమరవేసుకుని బాధపడుతూవుంటే ఆ బాధమీద మిరపగుండ చల్లినట్లు, "అలా క్లబ్బుకి వెళదాం వస్తారా" అని ఆహ్వానించాడు.

తనకేదో పేపర్లు దిద్దుకోవాల్సిన పని ఉందని చెప్పి తప్పించుకుని బామ్మగారి ముద్దుల మనవణ్ణి పంపి తలుపు వేసుకున్నాడు సుధాకరం. కానీ తన గదిలో ఒంటరిగా ఉన్నాడన్న ధీమాతో షేక్స్పియర్ పాత్రలాగ తన స్వగతాన్ని ప్రకాశంగానే బయటకి వొలికించేశాడు- అక్కసుతో.

"చూశావా? సుందరీ! నా బ్రతుకు ఎంత చులకనైపోయిందో. ఇదుగో- నాలుగు రోజులే అని చెప్పి నన్ను ఒంటరిగా విడిచి వెళ్ళావు. మూడు వారాలు దాటుతున్నా మొదటి రాసిన పొడి కార్డు ముక్క తప్ప మారు ఉత్తరం లేదు కదా. అర్ధగీ! నాకు ఇప్పుడే ఒక బ్రెయిన్ వేవ్- అంటే వివేక వీచిక ఒకటి వచ్చింది.

చూడునేనెలాటి రస్సావేస్తానో. అది బ్రహ్మభేద్యం అయిపోయి నువ్వు రెక్కలు కట్టుకు వచ్చేలా చేస్తాను.

తక్షణమే నీకు ఒక ఉత్తరం వ్రాసిపోస్టు డబ్బాలో వేసి వస్తాను. అలా ఉత్తరం వేశాక బామ్మగారిచ్చిన పులుసూ పచ్చడీ రుచి చూస్తాను" ఏకధాటిగా తన స్వగతాన్ని గట్టిగా కక్కేసి- ఉత్తరం పోస్టులో వేసి వచ్చాడు.

గట్టిగా నాలుగు రోజులైనా గడిచాయో లేదో- ఒక ఉదయం సుధాకరం వార్తా పత్రికలో తలదూర్చిన వేళ తలుపు చప్పుడైంది. "ఎవరూ?" అన్నాడు తలైనా ఎత్తకుండా.

"నేనూ-నేనూ"

ఎవరూ అంటే నేనూ అన్నది సమాధానం అనిపించుకోదు. అందుకే విసుక్కున్నాడు. గలగలమని నవ్వు ప్రవహించింది కిటికీలోంచి. "నేనండీ- సుందరిని" అని జవాబు.

"నీ అలవాటు మాత్రం మార్చుకోవు కదా. కిటికీలోంచి నామవాచకం కనిపించేదాకా నీ సర్వనామమే వినిపించావు. ఉత్తరమైనా లేకుండా ఎలా వచ్చేశావు. నేను - స్టేషన్కొచ్చి తీసుకువచ్చేవాణ్ణికదా ఎంతో సంతోషంగా"

"మీ చిత్రమైన ఉత్తరం చూశాక ఇక ఉత్తరం వ్రాసే వ్యవధి ఏది?"

"ఏమిటీ? నా ఉత్తరం అందిందీ?" సుధాకరం ఆశ్చర్యంగా, కాసింత గర్వంగా అడిగాడు.

సుందరి ఆ మాటవిని తెరలు తెరలుగా పగలబడి నవ్వింది. సుధాకరం కాస్త అయోమయంగానే చూశాడు.

"అయినా మీరు ఊహించుకున్నట్టు నేనేం భయపడీ, కంగారుపడీ వచ్చేశానని అనుకోకండేం. ఇదిగో మీ ఉత్తరం - భలే కవిత్వం. భలే కల్పనా చాతుర్యం. మీ ఉత్తరంలో కొన్ని వాక్యాలు మరోమారు వినిపిస్తా వినండేం.

మొన్న శనివారం ఉదయాన్నే మీ అక్కట- మన ఇంటికి వచ్చింది. పేరు రత్నం. నువ్వు పెళ్ళికి వెళ్ళావు. రేపో నేడో రావచ్చు అన్నాను.

సరే వస్తుంది కదా చూశాకనే వెళ్తాను- అంది.

నా స్వయం పాకం నాకే రుచిగా లేదు. ఇక రాకరాక వచ్చిన నీ తరపుచుట్టానికి ఏం పెడతాను- అని చెప్పి హోటల్ నుంచి కారియర్ తెప్పించాను. సలార్‌జంగ్ మ్యూజియమ్, గోల్కొండ, నెహ్రూ జూ లాజికల్ పార్క్- చూస్తానంది. ఇక సెలవు పెట్టక తప్పలేదు,...... ఇంతలేసి కల్పనలు చెయ్యగలరని నాకు తెలియనే తెలియదు మాష్టారూ!" గలగల నవ్విన సుందరి వేపు ఆశ్చర్యంగా చూస్తూ "ఇదంతా అబద్ధమనీ కల్పన అనీ ఎలా అనుకుంటున్నావు" అన్నాడు సుధాకరం- గంభీరంగా మొహం పెట్టి. "మీ రత్నం అక్క బాత్‌రూమ్‌లో ఉంది. ఇవాళ ప్లానెటోరియమ్ చూడాలంది. సమయానికి నువ్వూ వచ్చావు" అన్నాడు నాటకీయంగా.

"చూడండి మాష్టారూ! ఒకే ప్రదేశం నుంచి రెండు ఉత్తరాలు వచ్చాయి. ఒకటి మీరు రాసినది. ఇంకొకటి మా ప్రత్యేక విలేఖరి పంపిన రిపోర్టు. ఈ రెండూ పరస్పర విరుద్ధంగా ఉంటే నేను మా విలేఖరినే నమ్మాలికదా" అని కాటుక కళ్ళు అర్థవంతంగా తిప్పింది సుందరి.

ఎవరా విలేఖరి? ఏమాకథ అన్న ప్రశ్నలతో సతమతమౌతున్న సుధాకరాన్ని ఇంకా ఇబ్బంది పెట్టడం బాగుండదనుకున్న సుందరి - ఆ విలేఖరి ఎవరో చెప్పకుండా రిపోర్టుమాత్రం చదివి వినిపించే ప్రయత్నంలో ఒక ఇన్‌లండ్ లెటర్ తీసింది. "అమ్మాడూ! నువ్వు అడ్రసు రాసి నా చేతిలో పెట్టి వెళ్ళావు. ఆ రెండు ఇంగ్లాండు ఉత్తరాలు పోస్టులో వేసేశాను. ఇకనా దగ్గరలేవు. పక్క వీధిలో కాంతమ్మ ప్రసవించింది. పండులాటి మగపిల్లడు. పథ్యం పెట్టారు. తల్లీ పిల్లడూ కులాసాగా ఉన్నారు. ఇక మీ ఆయన అంటావా? ఉత్తి సత్తెకాలపు మనిషి మొహమాటి. మా దొంగ సన్నాసి రాజులా కాదు. క్లబ్బులనీ- పేకాటలనీ ఎరగడు. వేళకి ఇంటికి రావడం- వీధి గడపలో పడక కుర్చీ వేసుకుని ఏవో పేపర్లో,పుస్తకమో పట్టుకోవడం. పాపం! ఒక్కడూ దిగాలుగా ఉన్నట్టున్నాడు. ఎందుచేతనో ఇప్పటికే ఆలశ్యం చేశావు. ఇక వచ్చేస్తున్నావనీ కులాసాగా ఉన్నావనీ తలుస్తాను" ఇదీ మా విలేఖరి రిపోర్టు.

మీ ఉత్తరం అందిన తేదీకి ఒక రోజు తర్వాతనే మా విలేఖరి రిపోర్టు నాకు చేరింది. మీలాంటి అమాయకుల్ని వెయ్యి కళ్ళతో కనిపెట్టుకునే మా విలేఖరి రత్నం లాటి వెన్నెల విసనకర్ర వచ్చి మన ఇంట్లో దిగి తిష్ఠ వేస్తే నేరంగా కాకపోయినా సమాచారంగా అయినా

ఆ విషయం తన ఉత్తరంలో ప్రస్తావించకుండా ఉండడం అసాధ్యం. బామ్మగారు రాసిన- అదే మా విలేఖరి రాసిన - రిపోర్టు మన కాలనీ పోస్టాఫీసు ముద్రతో సరిగ్గా మీరు ఉత్తరం వేసిన రోజుకి తర్వాత తేదీతో వచ్చింది."

'ఎదురింటి బామ్మగారు అసాధ్యురాలే. నా రస్సా కాస్తా తుస్సుమనిపోయింది కదా' అని నవ్వుకుంటున్న సుధాకరాన్ని చూస్తూ "అబద్ధాలాడడానికి కూడా మంచి నేర్పూ, దూరదృష్టీ కావాలి మేష్టారూ" అని ఓదార్చింది సుందరి.

(ఆకాశవాణి హైదరాబాద్‌లో 26-10-93 న ప్రసారమైన నా నాటికకు కథారూపం)